క్లుప్తంగా

దసరా మేళాను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి

హుడాకాంప్లెక్స్: పద్మశాలీ దసరా మేళాను విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేళా పోస్టర్లను ఆమె ఆవిష్కరించి.. మాట్లాడారు. ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న దసరా మేళాలో పద్మశాలీలు ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉమ, గౌరవ అధ్యక్షురాలు రుణ చెరిపల్లి, వర్ణలీల, భారతమ్మ, చంద్రకళ, సుజాత, పూర్ణిమ, సూర్యకళ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



పెండ్యాల నగేష్, అరవింద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువత

దిల్‌సుఖ్‌నగర్: ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్–1,2 లకు చెందిన యువత నగేష్ అరవింద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఫాం ఇచ్చినా.. ఇవ్వకున్నా బరిలో ఉంటా

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దండెం రాంరెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న దండెం రాంరెడ్డి

మంచాల: నిరంతరం నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని ప్రజాసేవ చేసిన తాను ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దండెంరాంరెడ్డి అన్నారు. మంచాల మండలం లోయపల్లిలో మృతిచెందిన కొర్ర కిషన్‌నాయక్ కుటుంబసభ్యులను బుధవారం ఆయన కలిసి ఓదార్చారు. అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థికసహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పూర్తిగా తనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. అదిష్టానం బీఫాం ఇస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తామన్నారు. లేనిపక్షంలో ప్రజలందరి సహకారంతో ఖచ్చితంగా పోటీలో ఉంటామన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే అసెంబ్లీకి పోతామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు.. రాజునాయక్, బాలునాయక్, రాజేష్, సాయి, నితిన్, హాతీరాం, శివ, నర్సింహ, మల్లారెడ్డి, శ్రీను, నర్సింగ్, రాము, రాంబాబు, మధు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

కందుకూరు: గెలుపు ఓటములను సహజమని బొక్క జంగారెడ్డి, అర్జున్ అవార్డు గ్రహీత రవికాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాచులూరులో వెదిరె సీతారాంరెడ్డి స్మారక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించి.. వారు మాట్లాడారు. క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపుతో పాటు శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలతో పాటు షీల్డ్‌లను వెదిరె రవికాంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, శేఖర్‌గుప్తా, దీక్షిత్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం

తలకొండపల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సబితారెడ్డి గెలుపు ఖాయం

- విస్తృతంగా బీఆర్‌ఎస్ శ్రేణులప్రచారం
- గెలుపే లక్ష్యంగా గులాబీ నేతల వ్యూహం
- మహేశ్వరాన్ని చుట్టేస్తున్న నాయకులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డిని మరోసారి గెలిపించాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని అగర్‌మియాగూడ, లేమూరులో జెడ్పీటీసీ, అన్నోజిగూడ సరేందర్‌రెడ్డి వేర్వేరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబితారెడ్డి గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందరూ కారు గుర్తుకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు యాదయ్య, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాములు, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, ఇందిర, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చిర్ర సాయిలు, దశరథ, వి.రేవంత్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, జైపాల్‌రెడ్డి, పారిజాతం, కార్తీక్, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

బడంగ్‌పేట్: నియోజవర్గాన్ని అభివృద్ధి చేసిన మంత్రి సబితారెడ్డిని మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 21వ డివిజన్‌లోని భీష్మనగర్ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, బీటీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించిన ఘనత సబితారెడ్డిదేనని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, నాయకులు ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సంతోశ్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాయి, బి.జంగారెడ్డి, మూర్తి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..

కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లో కార్పొరేటర్ స్వప్న ఆధ్వర్యంలో కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి సబితారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్‌రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సరూర్‌నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డిని గెలిపించాలని బుధవారం సరూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు పోలె సుధామా ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సుధామా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికీ చేరాయని తెలిపారు. మరోసారి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ ముదిరాజ్, నర్సింహ, రాజు, అరవింద్, ప్రవీణ్, సురోత్తం, పాశం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మీర్‌పేట: ఎన్నికల హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ బీజేపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాలని కాషాయశ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. బుధవారం మీర్‌పేటలో బీజేపీ నాయకుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్‌పేట ప్రాంతంలో లెనిన్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలు అభివృద్ధి చేయలేదని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే బస్తీలను అభివృద్ధి చేయడంతో పాటు ఇంటి పన్నులను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని శ్రీరాములు ప్రజలను కోరారు. సమావేశంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్య యాదవ్, శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, సోమేశ్వర్, దశరథ, సూల ప్రభాకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



కడ్తాల్: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్
- కొనసాగుతున్న నేతల ఇంటింటి ప్రచారం

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆపార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకు వెళ్తోందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆశీర్వాదించాలని.. సీఎం కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి సీఎం చేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు మహేశ్, నాగార్జున, నర్సింహ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం..

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం జెడ్పీటీసీ దశరథ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన ముద్వీన్ నాయకులు దశరథ్‌నాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ వినోద్, గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకుల వెంకటయ్యగౌడ్, గోపాల్, జంగయ్య, రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు. మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్ మంగళవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం దశరథ్‌నాయక్ పరామర్శించి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

జైపాల్‌యాదవ్ గెలుపించుకుందాం

తలకొండపల్లి: మరోమారు జైపాల్‌యాదవ్‌కు ఓటు వేసి అఖండమైన మెజార్టీతో గెలిపించాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రజలను కోరారు. మండల పరిధిలోని మాదాయిపల్లిలో బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసుయాదవ్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తిలో జైపాల్‌యాదవ్‌ను, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ, సర్పంచ్ హైమావతి, రామస్వామి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్‌తోనే అభివృద్ధి



ప్రచార సభలో మాట్లాడుతున్న ఆచారి

మాడ్గుల: కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. మాడ్గుల మండలంలోని కోలుకులపల్లి, మాడ్గుల, బాలుతండా నర్సాయిపల్లి, జయరామ్ తండా తదితర జీపీల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని.. రాష్ట్రంలోనూ బీజేపీ సర్కార్ వస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి అండగా నిలిచి గెలిపించాలని ఆచారి కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, మల్లేష్ గౌడ్, వేంకటేష్ గౌడ్, శ్రీను, కమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచారిని గెలిపించాలి

ఆమనగల్లు: బీజేపీ కల్వకుర్తి అభివృద్ధి ఆచారిని గెలిపించాలని ఆమనగల్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య కోరారు. ఆమనగల్లు పట్టణంలోని 13వ వార్డు శ్రీనివాసకాలనీలో నూతన బీజేపీ కార్యాలయాన్ని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్‌తో కలిసి దుర్గయ్య ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసకాలనీలో ఆచారికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు శ్రీశైలంయాదవ్, చంద్రయ్య, చెన్నకేశవులు, నర్సింహ, ఆనంద్, మక్తాల వెంకటయ్య, రాజు, పాషా, జనిగల గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏర్పాటు తథ్యం..

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆచారిని గెలిపించాలని గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్ కోరారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి, నేరేళ్లకోలు, చెన్నారం తండాల్లో వారు ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని అన్నారు. ఆచారిని ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాందాస్‌నాయక్, పత్యా, రాజు, రమేశ్, రాకేశ్, కల్యాన్, శ్రీకాంత్‌నాయక్, రాజునాయక్, మునేశ్, నవీన్, మల్లేశ్, వినోద్, జగన్, రమేశ్ పాల్గొన్నారు.

కాషాయజెండా ఎగురవేస్తాం..

తలకొండపల్లి: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకొంటున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు తిర్మణీ రవిగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చుక్కాపూర్ బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల విశ్లేషణ–పార్టీ బలోపేతంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

'కారు' టైర్లకు పంక్చర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

- బీఆర్‌ఎస్ పార్టీని ఓడించండి
- కాంగ్రెస్‌ను గెలిపించండి
- 'గ్యారంటీ'గా అమలు చేస్తాం
- కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

హుడాకాంప్లెక్స్: 'ఒక మంచి వ్యక్తికి ఓట్లు వేయాలా? మోసం చేసిన వారికి వేయాలా? సీఎం కేసీఆర్ మూడెకరాల భూమి దళితులకు ఇస్తానని ఇవ్వలేదు. అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానన్నాడు. అదీ ఇవ్వలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్నాడు. చేయలేదు. యువతకు ఉద్యోగాలు ఇస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం మోసం చేశారు. ఒక్క హామీని కూడా నెరవేర్చని బీఆర్‌ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేస్తారు' అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. మోసం చేసిన కారు పార్టీ టైర్లకు పంక్చర్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్ చౌడీ సమీపంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన మహిళల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, చిక్కుళ్ల శివప్రసాద్, పున్నా గణేశ్, మహిళా నాయకురాలు నిర్మలారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రైతుబంధుతో పాటు కౌలు రైతులకు రూ.12వేలు అందజేస్తామని, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అధికారంలోకి వంద రోజుల్లో అందజేస్తామని హామీ ఇచ్చారు. హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీలో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేఎల్‌ఆర్ విద్యావేత్త, పారిశ్రామిక వేత్త, సంఘ సేవకుడని కొనియాడారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని, రైతులకు, మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు అండగా ఉండే కాంగ్రెస్‌ను బలపర్చాలని పిలుపునిచ్చారు.

మహేందర్‌కు స్వర్ణం



క్రాస్‌బో షూటింగ్‌లో విజేతలకుగా నిలిచిన తెలంగాణ క్రీడాకారులు

కందుకూరు: వరల్డ్ క్రాస్ బో షూటింగ్ పోటీల్లో మండలంలోని బాచుపల్లికి చెందిన మల్లగల మహేందర్ బంగారు పతకాన్ని సాధించాడు. వరల్డ్ క్రాస్ బో షూటింగ్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలను ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించారు. ఇండియాలో ఈ పోటీలను ఇండియన్ క్రోబో షూటింగ్ ప్రెసిడెంట్ రజతవిజ్, వైస్ ప్రెసిడెంట్ హీనా విజ్ నిర్వహించారు. ఆస్ట్రేలియా, రష్యా, ఇస్టోనియా, స్వీడన్, యూఎస్‌ఏ, ఇండియాతో కలిపి మొత్తం 7 దేశాలు పాల్గొన్నాయి. భారత్ నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర క్రీడాకారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 38 పతకాలు సాధించారని, అందులో తెలంగాణకు చెందిన క్రీడాకారులు బంగారు–10, వెండి–5, కాంస్యం–3 పతకాలను దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.



బంగారు పతకం సాధించిన మహేందర్

పంట ఎండిపోతోంది

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరుబావులు
- ఎండిపోతున్న వరిపంట
- పరిహారం ఇవ్వాలంటున్న రైతన్నలు

మంచాల: ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. దీనికి తోడు వర్షపాతం లోటుతో చేతికి వచ్చిన వరిపంట ఎండుముఖం పడుతోంది. దీంతో ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతన్నకు దిక్కుతోచని దుస్థితి నెలకొంది. రంగారెడ్డి జిల్లాలో సాధారణ వరిసాగు విస్తీర్ణం లక్షా 60వేల ఎకరాలు. ఈ వర్షాకాలంలో జిల్లాలో 86వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నాట్లు వేసిన నాటి నుంచి నెలరోజుల వరకు బోరుబావులు బాగానే నీరందించాయి. అయితే నెలరోజుల నుంచి భూగర్భజలాలు తగ్గుముఖం పడుతుండటంతో వరిపంట చేతికి వచ్చే దశలో బావుల్లో నీరు ఉండటం లేదు. దీంతో పంట ఎండిపోయే పరిస్థిత నెలకొంది. దీంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎక్కువగా యాసంగి పంటలు ఎండిపోతుంటాయి. అయితే ఈ ఏడాది దానికి భిన్నంగా వర్షకాలంలో కూడా వరి పంట ఎండిపోవడం కరువు తీవ్రతకు నిదర్శంగా మారింది.



ఆరుట్లలో ఎండిపోయిన వరిచేన్లు

అయోమయంలో రైతులు..

మంచాల మండలంలోని బండలేమూర్, చెన్నారెడ్డిగూడ, జాపాల, అజ్జిన తండా, ఆరుట్ల, రంగాపూర్, చీదేడ్ తదితర గ్రామాల్లో వరిచేన్లు పొట్టకొచ్చి ఈనే దశలో ఎండిపోతున్నాయి. చేతికొచ్చిన వరిచేన్లు ఎండిపోవడం చూసిన రైతులకు జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చు పెట్టి పంటలు సాగు చేసిన రైతులు నేడు అయోమాయంలో పడ్డారు.

బోర్లు ఎండిపోయాయి

నాకు ఎకరంన్నర పొలం ఉంది. రెండు బోర్లు ఉన్నాయి. ఈ ఏడాది ఒక ఎకరం వరిపంట సాగుచేశాను. పంట చేను బాగానే కాచింది. వరి పంట చేతికి వచ్చింది. రెండు వారాల నుంచి బోర్లు ఎండిపోయాయి. ఏం చేయాలో దిక్కుతోచని దుస్థితి. ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనుగోలు చేసి వరిపంటకు పోస్తున్నాం.

– లాలునాయక్, బండలేమూర్, మంచాల